బాలల బంగారు భవిష్యత్తే.. రాష్ట్ర భవిష్యత్తు

- మొదటిరోజే దుస్తులు, పుస్తకాలు
- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క
- 'ఫిట్'లెస్‌లేని బస్సులపై కొరడా..
- రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన ప్రభుత్వ బడులు
- విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు అందజేసిన మంత్రులు, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర చరిత్రలో మొట్ట మొదటి సారిగా ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజే పిల్లలకు దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేసిన ఘనత తమ ప్రజా ప్రభుత్వానికి దక్కుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు బుధవారం పున:ప్రారంభమయ్యాయి. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో మరమ్మతులు నిర్వహించారు. వాటిని దాదాపు పూర్తిచేసి పాఠశాలలకు కొత్త రంగులతో, తోరణాలతో ఉపాధ్యాయులు విద్యార్థులను ఆహ్వానించారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం కాన్పమేడిగూడ రోడ్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత, మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులపై పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. కరీంనగర్ జిల్లాలోని గంగాధర మండలం ఒద్యారం జడ్‌పిహెచ్ పాఠశాల ఆవరణను మామిడి, అరటి, కొబ్బరి తోరణాలతో అలంకరించి విద్యార్థులను ఆహ్వానించారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లోని పాఠశాలల్లో జరిగిన బడిబాట కార్యక్రమాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని విద్యార్థులకు యూనిఫామ్‌లు, నోటు బుక్కులు, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు.

ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఎన్ఎస్ కెనాల్ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మంత్రి తమ్మల నాగేశ్వరరావుతో కలిసి డిప్యూటీ సిఎం భట్టి హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి కావాల్సిన తరగతి గది, తాగునీరు, టాయిలెట్ రన్నింగ్ వాటర్‌తో సదుపాయాల కల్పన చేస్తున్నట్టు తెలిపారు. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్ సరైన సమయంలో అందిస్తే, మంచి ఫలితం ఉంటుందన్న దృష్టితో పాఠశాలలు తెరిచిన రోజునే అందేలా కార్యాచరణ రూపొందించినట్టు తెలిపారు. అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. విద్యపై ఎంత ఖర్చైన ప్రభుత్వం వెనకాడదని, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. కొణిజర్ల హైస్కూల్‌లో విద్యార్థులకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ చేతుల మీదుగా పుస్తకాలు పంపిణీ చేశారు. జిల్లాలోని అన్ని మండలాల్లో విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాలల ఆవరణం శుభ్రం చేయించారు. ఖమ్మం రూరల్ మండలం పెద్ద తండా పంచాయతీ పరిధిలోని జలగం నగర్ ప్రాథమిక పాఠశాలలో వర్షం నీరు నిలువకుండా మట్టి పోయించారు. ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు, వంటశాల నిర్మాణం, గేట్ల ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయి.

హైదరాబాద్ అబిడ్స్‌లోని అలియా మోడల్ హైస్కూల్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో ఉన్న వాటర్ ట్యాంక్‌ను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ.. కోడ్‌కి ముందే ప్రభుత్వం తెలంగాణలో 26,872 పాఠశాలల్లో రూ. 1100 కోట్లతో అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో మౌలిక వసతులు, తాగునీరు, టేబుల్స్, మరమ్మతులు, కలర్స్ పనులు చేపట్టినట్టు తెలిపారు. రాష్ట్రంలోని విద్యార్థుల తల్లిదండ్రులకు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ ఔట్స్ లేకుండా బట్టలు, మధ్యాహ్న భోజనం, సౌకర్యాలు కల్పిస్తున్నామని, మెగా డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేస్తామని తెలిపారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని 16 ప్రభుత్వ స్కూల్స్‌లో 'అమ్మ ఆదర్శ స్కూల్' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ స్కూళ్లను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దాలని తాము సంకల్పిస్తున్నామని తెలిపారు.

సంగారెడ్డి జిల్లా రాయికోడ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమానికి మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరయ్యారు. మంత్రి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం, చదువుల తల్లి సరస్వతి దేవి, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్టు తెలిపారు. సిద్దిపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, నంగునూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్ రెడ్డి విద్యార్థులకు ఉచిత నోట్, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందజేశారు. ప్రజ్ఞాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కొండపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జిల్లా కలెక్టర్ మను చౌదరి హాజరై విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత యూనిఫామ్స్, పాఠ్య, నోట్ పుస్తకాలు అందజేశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు హైస్కూల్‌లో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా పంపిణీ చేశారు. భద్రాచలంలోని జగదీష్ కాలనీలో బడిబాట కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ప్రారంభించారు. అన్నపురెడ్డిపల్లి బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేశారు. రంగారెడ్డి జిల్లా శివరాంపల్లిలోని జిల్లా పరిషత్ హై స్కూల్ బడిబాట కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొని మాట్లాడారు. మండల విద్యాధికారి సర్దార్ నాయక్ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మీవాడ పాఠశాలలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్ పాల్గొని పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను అందించారు. ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ప్రైమరీ పాఠశాల-1లో కలెక్టర్ రాజర్షి షా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ పాల్గొన్నారు. నేరడిగొండ మండలంలోని వడూర్ పాఠశాలలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు.

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలో ప్రభుత్వవిప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ హనుమంతు కె.జెండగే, ఎమ్మెల్యే.. విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించి, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పాఠ్యపుస్తకాలు అందజేశారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో కలెక్టర్ దాసరి హరిచందన విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కేతెపల్లి, నకిరేకల్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఎమ్మెల్యే వీరేశం యూనిఫామ్స్ పంపిణీ చేశారు.వేములపల్లి మండలంలోని జడ్‌పిహెచ్ఎస్‌లో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి చేతుల మీదుగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీచేశారు. సూర్యాపేట జిల్లా మునగాలలోని జిల్లా పరిషత్ హై స్కూల్లో జిల్లా కలెక్టర్ వెంకట్రావు విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేశారు. తుంగతుర్తి మండలం అన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే మందుల సామేల్ పాల్గొన్నారు. కరీంనగర్ జిల్లా చొప్పదండిలో జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను, ఏకరూప దుస్తులను స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పంపిణీ చేశారు. పదో తరగతిలో 10 జిపిఎ సాధించిన ఎలిగేటి సవితకు ఎమ్మెల్యే రూ.5000 ప్రోత్సాహాన్ని అందజేశారు. సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్‌లో ఎమ్మెల్యే సత్యం పాల్గొని యూనిఫామ్స్, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.

సమస్యల స్వాగతం

ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలో బడిబాట కార్యక్రమం మొక్కుబడిగా సాగింది. కొందరు ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమానికి డుమ్మా కొట్టారు. బడిబాట కార్యక్రమం ప్రారంభమై వారం రోజులు అయినా పాఠశాలలు అపరిశుభ్రంగా ఉన్నాయి. ముదిగొండ హైస్కూల్‌లో అసాంఘిక కార్యకలాపాలతోపాటు, మందుబాబులకు అడ్డాగా మారి బీరు, బ్రాందీ, సీసాలు పాఠశాలలో దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రం నుంచి పాఠశాలలకు తరలించే పాఠ్యపుస్తకాలను ఉపాధ్యాయులు విద్యార్థుల చేత మోయిస్తున్నారు. భద్రాద్రి జిల్లా అశ్వారావుపేటలోని మాలపల్లి మండల పరిషత్ పరిషత్ పాఠశాల శుభ్రం చేసే వారు కరువయ్యారు. ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిచ్చింది. ఇదిలా ఉండగా పాఠశాలకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రాకపోవడం గమనర్హం. దీంతో విద్యార్థులు పాఠశాల ఆవరణంలో ఆటలాడుతూ కాలక్షేపం చేశారు. అభివృద్ధిపనులు కూడా కొనసాగుతున్నాయి.

'ఫిట్'లెస్‌లేని బస్సులపై కొరడా..

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై స్కూల్స్ ప్రారంభం రోజే రవాణాశాఖ అధికారులు కొరడా ఝులిపించారు. గ్రేటర్‌లోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో 71 బస్సులపై కేసులు నమోదు చేశారు. ఇక హైదరాబాద్ నగర పరిధిలోని మొత్తం అయిదు జోన్‌లలో కలిపి మొత్తం 25 బస్సులను సీజ్ చేయగా.. అందులో 19 బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోగా.. మరో ఆరు బస్సులకు పర్మిట్‌తో పాటు టాక్స్ చెల్లించలేదని సంబంధిత అధికారులు గుర్తించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మొత్తంగా 12 వేల బస్సులు ఉండగా, వాటిలో ఎనిమిది వేల బస్సులకు మాత్రమే ఫిటినెస్ ఉందని రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం చేసిన తనిఖీల్లో ఫిట్‌నేస్ లేకుండా ఉన్న 46 బస్సులు గుర్తించినట్టు తెలిపారు. ఆ బస్సులకు సంబంధించిన విద్యసంస్థలపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

అంగన్వాడీ టీచర్ల ధర్నా

- మిషన్ భగీరథ సర్వే మినహాయించాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మిషన్ భగీరథ సర్వే నుంచి అంగన్వాడీ టీచర్లకు మినహాయింపు ఇవ్వాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా సమీకృత కలెక్టరేట్ ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో మిషన్ భగీరథ సర్వేను అంగన్‌వాడీ టీచర్లు చేయాలని అధికారులు సూచించినప్పటికీ శిక్షణ సమయంలోనే సర్వే చేయలేమంటూ యూనియన్ తరుపున అధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారన్నారు. తప్పనిసరిగా చేయాలంటూ ఒత్తిడి చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని, దీన్ని విరమించుకోవాలని సూచించారు. ఇప్పటికే అంగన్‌వాడీ టీచర్లకు అనేక యాప్‌ల ద్వారా వివిధ సర్వేలు చేయాలని ప్రభుత్వం నుంచి ఒత్తిళ్లు వస్తున్నప్పటికీ తట్టుకొని వారి అదనపు పనులను నిర్వర్తిస్తున్నారని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న సమయంలో శిశువుల నుంచి ఐదేండ్ల పిల్లల వరకు వారి సంరక్షణతోపాటు పోషక పదార్థాలు అందించడం, గర్భవతులకు పోషక పదార్థాలు అందించడం లాంటి విధులు అంగన్‌వాడీ టీచర్లు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇలాంటి సమయంలో అంగన్‌వాడీ టీచర్లను మరోమారు మిషన్ భగీరథ సర్వేలు చేయాలని ఒత్తిడి చేయడంతో వాళ్ల విధులకు ఆటంకం కలుగుతుందన్నారు. అధికారులు ఒత్తిడి చేస్తే సహించబోమని, ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి జి. భాస్కర్, జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. పద్మ, జిల్లా అధ్యక్షులు లక్ష్మీ, కోశాధికారి పద్మ, నాయకులు ఎడ్ల లక్ష్మీ, వసంత, అనిత, శ్యామల, శబరి, సురేఖ, భూలక్ష్మీ, ప్రేమలత, కళావతి, టీచర్లు పాల్గొన్నారు.

కోదండరామ్ సేవలను ఉపయోగించుకుంటాం

- మంత్రి జూపల్లి కష్ణారావు

ప్రజాశక్తి - కల్చరల్

రాష్ట్ర సాధనలో యువతను, విద్యావంతులను, రైతులను, ఉద్యోగులను ఎకతాటిపై నడిపించిన కోదండరామ్ సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వారిని ప్రభుత్వంలో ఉపయోగించుకుంటుందని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రవీంద్ర భారతీ ప్రధాన వేదికపై శ్రుతి లయ ఆర్ట్స్ సిల్‌వెల్ కార్పొరేషన్ నిర్వహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రొఫెసర్ కోదండరామ్‌ను తెలంగాణ సాధికారిత విప్లవ యోధ బిరుదుతో సంస్థల పక్షాన జూపల్లి సత్కరించి మాట్లాడారు తెలంగాణ అమరవీరుల త్యాగాలు విస్మరించలేమని, అదే సందర్భంలో కోదండరామ్ పోరాట పటిమను కూడా గుర్తుంచుకోవాలని అన్నారు. సత్కారం అందుకున్న కోదండరామ్ మాట్లాడుతూ సామాజిక కార్యక్రమాలు సమిష్టిగా జరుగుతాయని, తెలంగాణ ఉద్యమం సామాజిక చైతన్య కార్యక్రమమని, దీనిలో తాను ఒకరినని అన్నారు. సంఖ్య శాస్త్రవేత్త దైవజ్ఞ శర్మ అధ్యక్షత వహించిన సభలో నాయకులు హరి కిషన్ రామకష్ణ, కె దామోదర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకులు మిత్రను స్వర సిద్ధ గాత్ర బిరుదుతో మంత్రి సత్కరించారు.

పాఠశాల అభివృద్ధిపై సిఎం కృషి అభినందనీయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని సిఎం రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పదేళ్లుగా బిఆర్ఎస్ సర్కారులో పాఠశాలల రేషలైజేషన్ పేరిట నాలుగు వేల పాఠశాలలను దెబ్బతీసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పాఠశాలల అభివృద్ధి కోసం రూ.రెండు వేల కోట్లు కేటాయించడాన్ని ఆయన స్వాగతించారు.

సిఎం రేవంత్‌ను కలిసిన మానవతారాయ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ బడులను బలోపేతం చేయడానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి టిపిసిసి రాష్ట్ర నాయకుల కోటూరి మానవతారాయ్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నిరుద్యోగ జెఎసి నాయకులు తాళ్లపల్లి నరేష్‌గౌడ్, నాగరాజు, హేమంత్‌చౌదరి, సుదగాని మధుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు, వరదల్లో నష్ట నివారణకు ప్రాధాన్యత

- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలి
- నివాసయోగ్యం కాని నిర్మాణాలను తొలిగిస్తాం
- హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో వర్షాకాలంలో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని బిసి సంక్షేమం, రవాణాశాఖ, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయా శాఖల ఉన్నతాధికారులకు సూచించారు. నగరంలో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో బుధవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సమావేశం మందిరంలో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. దాదాపు రెండు గంటలకుపైగా కొనసాగిన సమీక్షా సమావేశంలో మాన్‌సూన్ ప్రిపరేషన్ యాక్షన్ ప్లాన్‌ను అధికారులు మంత్రికి వివరించారు. పారిశుధ్యం, నాలాల్లో పూడికలు, నీటి నిల్వలపై చర్చ జరిగింది. జిహెచ్ఎంసి, వాటర్‌బోర్డు, విద్యుత్ శాఖలోని వివిధ విభాగాల పనితీరును సమీక్షించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై పలు సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి మాట్లాడారు. నగరంలో శానిటేషన్ సమస్య ఉందని, దాన్ని అధిగమించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని తెలిపారు. చికెన్, మటన్ వేస్టేజ్ ద్వారా ఆదాయం పెరిగేలా త్వరలో సమీక్ష చేస్తామన్నారు. పురాతన భవనాలకు సంబంధించిన వాటిని గుర్తించామని, నివాసయోగ్యం కాని వాటిని తొలిగిస్తామని చెప్పారు. వర్షాల నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. రాబోయే వన మహోత్సవంలో హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా ఉంచాలన్నారు. వాటర్ లాకింగ్ పాయింట్స్ గుర్తించి వర్షం పడిన వెంటనే అక్కడకు సిబ్బంది వెళ్లి నీరు నిల్వ ఉండకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. రోడ్లపై చెత్తాచెదారం పేరుకుపోతోందని, శానిటేషన్‌కు సంబంధించి జాగ్రత్తగా వ్యవహరించాలని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లు, ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో 141 వాటర్ లాకంగ్ పాయింట్స్‌ను గుర్తించామని, నీటిని తొలగించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వం పక్షాన జీహెచ్ఎంసీకి అన్ని సహాయసహకారాలు అందిస్తామన్నారు. ఏ సమస్య వచ్చినా అందరం కలిసికట్టుగా ముందుకెళ్దామని చెప్పారు. అందరికీ అందుబాటులో ఉండేలా ఒక నెంబర్‌ను ఉంచాలని అధికారులను ఆదేశించారు.

లేక్ ప్రొటెక్షన్ ముఖ్యమైందని, అక్కడ అభివృద్ధికి బాధ్యత తీసుకోవాలని ఐటీ కంపెనీలను ఆదేశించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచాలని, ఏ సమస్య ఉన్న ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని అన్నారు. నాలాల్లో సిల్ట్ తీయడంపై గతంలో ఆరోపణలు వచ్చాయని, ఈసారి అందరి సహకారంతో ముందుకెళ్తామన్నారు. సిల్ట్ తీయడంపై అవినీతి జరిగిందంటే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కుక్కలతో నగర ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణ సజావుగా జరగాలని, క్షేత్ర పరిధిలో పర్యవేక్షించాలని అన్నారు. రెస్టారెంట్లు, హెూటళ్లలో నాణ్యమైన, హైజనిక్ ఫుడ్ అందించేలా చూడాలని చెప్పారు.

ఈ సమావేశంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఇన్‌చార్జి కమిషనర్ ఆమ్రపాలి, జోనల్ కమిషనర్లు, ఇఎన్‌సి జియా ఉద్దీన్, ఇవిడిఎం డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, ఎస్ఎన్‌డిపి సిఇ కోటేశ్వరరావు, సిఇ దేవానంద్, జోనల్ కమిషనర్లు, స్నేహ శబరిష్, అభిలాష అభినవ్, హేమంత్ సహదేవ్‌రావు, రవి కిరణ్, వెంకన్న, అడిషనల్ కమిషనర్లు కె శ్రీవాత్సవ, సత్యనారాయణ, ఉపేందర్ రెడ్డి, రాచకొండ, హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ ఎసిపిలు, జలమండలి నుంచి డైరెక్టర్లు అజ్మీరాకృష్ణ, స్వామి, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, విద్యుత్ విభాగం, ట్రాఫిక్ విభాగం, వాటర్ బోర్డ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

కాంట్రాక్టు కార్మికులకు పెండింగ్ జీతాలివ్వాలి

- ఐఎఫ్‌టియు, సిఐటియు ఆధ్వర్యంలో మంత్రులకు వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ హాస్పిటల్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు మూడు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కోరుతూ డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఐఎఫ్‌టియు, సిఐటియు ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు వై విక్రమ్, ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు కె శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఖమ్మంలోని ప్రభుత్వ హాస్పిటల్‌లో శానిటేషన్ గార్డెన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్‌లలో 259 మంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారని, వీరికి దాదాపు మూడు నెలల నుంచి వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో జిల్లాకు విచ్చేసిన డిప్యూటీ సిఎం భట్టికి, మంత్రి తుమ్మలకు తమ సమస్యను విన్నవించుకున్నట్టు చెప్పారు. జీతాలు రాక ఇళ్ల కిరాయిలు కట్టలేక, పిల్లల చదువుల పుస్తకాలకు డబ్బులు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్మికులు మూడు నెలల నుంచి పస్తులతో ఉంటూనే.. వందలాదిమంది ప్రజల ఆరోగ్యాలు పాడుతూ హాస్పటల్ శుభ్రంగా ఉంచుతూ నిత్యం పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ సిఎం, మంత్రి వెంటనే జోక్యం చేసుకొని ప్రతి నెలా కార్మికులకు జీతాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘాల నాయకులు అంబేద్కర్, వెంకట రమణ, అశోక్ ప్రసాద్, వెంకన్న, రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముఖ్యమంత్రి ఎవరు?

- పాఠ్యపుస్తకాల్లో ఇంకా కెసిఆర్ పేరే
- తప్పుడు సమాచారం ముద్రించిన విద్యాశాఖ
- తెలుగు వాచకం ముందుమాటను సవరించని అధికారులు
- అయోమయంలో విద్యార్థులు
- ఎస్‌సిఇఆర్‌టి తీరుపై సర్వత్రా విమర్శలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ముఖ్యమంత్రి ఎవరు?, విద్యాశాఖ మంత్రి ఎవరు?, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ఎవరు?, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఎవరు?. వీటికి సమాధానం అందరికీ తెలుసు. కానీ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ (ఎస్‌సిఇఆర్‌టి) ప్రచురించిన పాఠ్యపుస్తకాల్లో మాత్రం ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు (కెసిఆర్), విద్యాశాఖ పూర్వపు మంత్రులు జి జగదీశ్‌రెడ్డి, కడియం శ్రీహరి, ప్రస్తుత విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, పాఠశాల విద్యాశాఖ పూర్వపు సంచాలకులు ఎం జగదీశ్వర్, ప్రస్తుత సంచాలకులు టి చిరంజీవులు, ప్రభుత్వ సలహాదారు కెవి రమణాచారి అని ఉన్నది. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ముద్రించిన పాఠ్య పుస్తకాల్లో ఈ తప్పుడు సమాచారాన్ని ఎస్‌సిఇఆర్‌టి ప్రచురించడం ఇప్పుడు చర్చనీయాంశం గా మారింది. గతేడాది డిసెంబర్ ఏడో తేదీన ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. విద్యాశాఖను ఆయనే పర్యవేక్షణ చేస్తున్నారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా గతంలో వాకాటి కరుణ, ప్రస్తుతం బుర్రా వెంకటేశం పనిచేస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ సంచాలకులుగా శ్రీదేవసేన నాలుగేళ్లకు పైగా కొనసాగుతున్నారు. కానీ ఎస్‌సిఇఆర్‌టి ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించిన ఒకటి నుంచి పదో తరగతి వరకు సింగిడి-2 తెలుగు వాచకం (ప్రథమ భాష) పాఠ్యపుసకాల్లో ముందుమాటను సవరించకుండా పాత సమాచారాన్ని ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది. ఒకటి నుంచి పదో తరగతి వరకు ఈ పాఠ్యపుస్తకాలను ముద్రించారు. విద్యార్థులు అయోమయానికి గురయ్యే అవకాశము ంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడం, ముఖ్యమంత్రి మారడం వంటి రాజకీయ పరిణామాలను ఎస్‌సి ఇఆర్‌టి పరిగణనలోకి తీసుకోకుండానే ముద్రించిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాఠ్యపుస్తకంలో ప్రచురించిన సమాచారాన్నే పరిగణనలోకి తీసుకుంటే ఇబ్బందులు ఎదురవుతాయి. జనరల్ నాలెడ్జ్ ప్రశ్న కింద తెలంగాణ ముఖ్యమంత్రి ఎవరు? అన్న ప్రశ్న వస్తే సమాధానం ఏం రాయాలో అర్థం కాని పరిస్థితి తలెత్తుతుంది. ఎస్‌సిఇఆర్‌టి ముద్రించిన పాఠ్యపుస్తకం ప్రకారం రాస్తే తప్పుడు సమాధానం అవుతుంది. తాజా సమాచారాన్ని ముందుమాటలో ఇవ్వకపోవడం పట్ల విమర్శలు వస్తున్నాయి. గతేడాది కూడా రాజ్యాంగ పీఠికను పాఠ్యపుస్తకాల్లో ముద్రించినపుడు వివాదం తలెత్తింది. సామ్యవాదం, సోషలిస్టు పదాలను తొలగించి ఇవ్వడం చర్చనీయాంశమైంది. ఈ ఏడాది ప్రభుత్వం మారినా, ముఖ్యమంత్రి మారినా తాజా సమాచారాన్ని ఇవ్వకపోవడం వివాదానికి దారితీసింది. విద్యాశాఖ, ఎస్‌సిఇఆర్‌టి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఎలా స్పందిస్తుందో వేచిచూడాలి.

అక్టోబర్‌లోనే ముద్రణకు ఇచ్చాం
ఎం రాధారెడ్డి, ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్

పాఠ్యపుస్తకాల రూపకల్పనకు సంబంధించి ఎడిటోరియల్ బోర్డు ఉంటుందని ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ ఎం రాధారెడ్డి బుధవారం హైదరాబాద్‌లో తనను కలిసిన విలేకర్లతో చెప్పారు. ఆ బోర్డు సమావేశమై అక్టోబర్‌లోనే పాఠ్యపుస్తకాలను రూపొందించి ముద్రణకు ఇచ్చామని అన్నారు. ఆ బోర్డు చెప్పిందే పాఠ్యపుస్తకాల్లో ముద్రించాల్సి ఉంటుందన్నారు. అందులో మార్పు చేసి ముద్రించే అవకాశముండబోదని వివరించారు. వచ్చే విద్యాసంవత్సరంలో పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు సకాలంలో ఇవ్వాలంటే ఈ ఏడాది నుంచే కసరత్తును ప్రారంభించాల్సి ఉంటుందని చెప్పారు. గతేడాది అక్టోబర్‌లో సమాచారం ఇచ్చినందునే పాత సమాచారం పాఠ్యపుస్తకాల్లో వచ్చిందని అన్నారు.

మహారాజ శ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/అర్బిట్రేటర్ కర్నూలు
డిస్ప్యూట్ నెంబర్ : 148/2023

శ్రీరామ్ రాఘవేంద్ర చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్.
కర్నూలు బ్రాంచి. ...డిస్‌పుటెంట్

వర్సెస్

M.Mounika మరియు 4 ఇతరులు. ...ఆపోనెంట్స్

ఆపోనెంట్ 1 నుండి 5 గురికి నోటీసులు

1). M.Mounika, W/o M.Balakrishna Reddy, Flatno:402, Srinivasa Aparthment, Saidabad, HYD.
2) M.Balakrishna reddy S/o M.Rami Reddy, Senior Asst, Printing Stationary & Stores Purchas, Printing wing, Chanchal guda, Hyderabad.
3) R.Naring rao, S/o R.Laxman Rao, Binder Printing Stationary & Stores Purchase, Printing wing, Chanchal guda, Hyderabad.
4) M.Harinath Reddy S/o M.Venkat Reddy, Junior Asst, Labour Court - I, Hyderabad.
5) T.Lingareddy, S/o. T.Mohan Reddy, Senior Asst, Revunue Department, Collectorate, Narayanapet,

...ఆపోనెంట్స్

డిస్ప్యూట్ బాకీమొత్తం రూ. 11,48,185=00 రాబట్టుకొనుటకు గాను మీ పైన దాఖలు చేసిన డిస్ప్యూట్‌లో 1 నుండి 5వ అపోనెంట్స్ అయిన మీరు 26-06-2024వ తేది రోజున ఉదయం 11.00 గంటలకు మీరుకానీ మీ తరపు న్యాయవాది ద్వారా కానీ హాజరై మీకు ఏమైనా అక్షేపణలు వున్న యెడల తెలుపుకోవలెను. లేని యెడల సదరు డిస్ప్యూట్ దావా కేసు మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
వాయిదా : 26-06-2024
బై ఆర్డర్ ఆఫ్ ది డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ అర్బిట్రేటర్, కర్నూలు.

ఉన్నత న్యాయస్థానం వారి న్యా పరిధిలో, మద్రాసు వద్ద
(టెస్టిమెంటరీ & ఇన్‌టెస్టేట్ న్యాయ పరిధి)
ఓ.పి. నం.656 ఆఫ్ 2023 లో
దరఖాస్తు నం.1757 ఆఫ్ 2024

దిగువ వీరి మధ్య
సి.ఆర్. కుమార్,
తండ్రి కీ॥శే॥ సి.ఎన్. ప్రసాద్,
చావలి నిలయం,
నం. 68ఎ, గ్రీన్‌వేస్ రోడ్,
ఆర్.ఎ.పురం, చెన్నై-600 028.
....దరఖాస్తుదారు/ వాది

మరియు

1. మల్లాడి లీలేశ్వరి దేవి, తండ్రి కీ॥శే॥ సి.ఎన్. ప్రసాద్, "ఈశ్వర్ సదన్", ఫ్లాట్ నం.303, సి-49, డి.డి. కాలనీ, హైదరాబాద్-500 007.
2. జోయ్‌సుల శివశంకరి, తండ్రి కీ॥శే॥ సి.ఎన్. ప్రసాద్, ఫ్లాట్ 1డి, "శ్రీనివాస టెర్రస్", నం.52, 2వ మెయిన్ రోడ్, గాంధీనగర్, ఆదయార్, చెన్నై-600 020.
3. మల్లాడి లక్ష్మిభువనేశ్వరి, తండ్రి కీ॥శే॥ సి.ఎన్. ప్రసాద్, సనాలి రెసిడెన్సీ, ఫ్లాట్ నం.401, 6-3-1090/1/క్యూ, రాజ్‌భవన్ రోడ్, సోమాజిగూడ, హైదరాబాద్-500 082.
....ప్రతివాదులు/ప్రతివాదులు

మధ్య,
టు,
1. మల్లాడి లీలేశ్వరి దేవి, తండ్రి కీ॥శే॥ సి.ఎన్. ప్రసాద్, "ఈశ్వర్ సదన్", ఫ్లాట్ నం.303, సి-49, డి.డి. కాలనీ, హైదరాబాద్-500 007.
2. మల్లాడి లక్ష్మిభువనేశ్వరి, తండ్రి కీ॥శే॥ సి.ఎన్. ప్రసాద్, సనాలి రెసిడెన్సీ, ఫ్లాట్ నం.401, 6-3-1090/1/క్యూ, రాజ్‌భవన్ రోడ్, సోమాజిగూడ, హైదరాబాద్-500 082.

సర్/మేడం,

పై కేసును గౌరవ ఉన్నత న్యాయస్థానం, మద్రాసు వద్ద గౌరవ ప్రిన్సిపల్ మాస్టర్ కోర్టు వారి సమక్షంలో 26.03.2024న విచారణకు వచ్చింది మరియు పత్రికా ప్రకటన ద్వారా వారికి తెలియజేయవలసిందిగా మీ ఇరువురిని గౌరవ కోర్టు వారు ఆదేశించారు. కావున మీరు స్వయంగా లేదా మీ కౌన్సిల్ ద్వారా కాని **15.07.2024**న ఉ॥ **10.30**గం.లకు గౌరవ ఉన్నత న్యాయస్థానం, మద్రాస్ వద్ద, సదరు గౌరవ ప్రిన్సిపల్ మాస్టర్ కోర్టు సమక్షంలో హాజరవవలసిందిగా కోరుతూ మీ దృష్టికి తెస్తున్నాము, విఫలం చెందిన ఏదైతే, విషయాన్ని విని మరియు మీ గైర్హాజరులో నిర్ణయం తీసుకోబడుతుంది.

మీ విధేయులు,
మెసర్స్ వి. అక్షయ కమల,
దరఖాస్తుదారు/ వాది తరపు కౌన్సిల్,
"కైలెనస్ హాల్", 2వ అంతస్తు,
పాత నం.157, కొత్త నం.323,
లింఘి చెట్టి వీధి, చెన్నై-001.

మోడీ నిరంకుశత్వానికి మోహన్ భగవత్ వ్యాఖ్యలే నిదర్శనం

- టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజాసేవకుడికి అహంకారం ఉండకూడదంటూ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు మోడీ నిరంకుశత్వానికి నిదర్శమని పిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్ అన్నారు. ఆయన వ్యాఖ్యలు దేశ వ్యాప్తంగా దుమారం లేపుతున్నాయని తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో విద్వేషాలు పెంచారని మోడీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మణిపూర్ అల్లర్లపై భగవత్ మాటలు మోడీ వైఫల్యాలకు సంకేతామన్నారు. భవిష్యత్తులో బిజెపి అంతర్గత పరిణామాలు ఎటు వైపు దారి తీస్తాయో తెలియదన్నారు. హోం శాఖ నుంచి అమిత్ షాను తప్పించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు, నితీశ్‌కుమార్ చాలా కాలం మోడీతో ప్రయాణం సాగించలేరని నొక్కి చెప్పారు.

బిసిలకు మంత్రి పదవులివ్వడాన్ని స్వాగతిస్తున్నా : విహెచ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబు ఎనిమిది మంది బిసిలకు మంత్రి పదవులు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్టు మాజీ ఎంపి వి హనుమంతరావు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కులగణన చేయడానికి ఎన్‌డిఎలో భాగస్వాములుగా ఉన్న నితీష్ కుమార్, చంద్రబాబు నాయుడు చొరవ తీసుకోవాలని కోరారు.

వృద్ధురాలిపై లైంగిక దాడి

- పరారీలో నిందితుడు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పూటుగా మద్యం తాగిన ఓ వ్యక్తి వయసు, వావి వరుసలు మరిచి వృద్ధురాలిని లాక్కెళ్లి లైంగిక దాడికి ఒడిగట్టాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలోని చందంపేట మండలం చిత్రియాల గ్రామంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపి వివరాల ప్రకారం.. చిత్రియాల గ్రామానికి చెందిన వృద్ధురాలికి (85) ఆరుగురు కుమార్తెలు ఉన్నారు. వారందరి వివాహం కాగా, ఆమె గ్రామంలో ఒంటరిగా ఉంటోంది. పిఎపల్లి మండలంలోని తన కుమార్తె వద్ద నుంచి వారం రోజుల కిందట పెన్షన్ కోసం చిత్రియాల గ్రామానికి వచ్చింది. పింఛన్ ఎప్పుడు ఇస్తారో తెలుసుకుందామని ఈ నెల 10వ తేదీ (సోమవారం) రాత్రి ఎనిమిది గంటలప్పుడు బిక్కుమాండ్ల వీరయ్య ఇంటికి బయలుదేరింది. అదే దారిలో చాట్ల బలరాం కలిసి అక్క బాగున్నావా.. అని పలుకరించడంతో ఆగి మాట్లాడుతుండగానే ఆమె చెయ్యి పట్టుకొని నోట్లో టవల్ పెట్టి బలవంతంగా అతని ఇంట్లోకి లాక్కెళ్లాడు. తలుపులు వేసి లైంగిక దాడి చేశాడు. మరుసటి రోజు మంగళవారం మధ్యాహ్నం 12 గంటల వరకు బంధించి పలుమార్లు దురాఘతానికి ఒడిగట్టాడు. దాంతో వృద్ధురాలి పెదవులకు, చేతులకు ఛాతిపై గాయాలయ్యాయి. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐ సురేష్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు. బలరాం పరారీలో ఉన్నట్టు తెలిపారు. వైద్య పరీక్షల నిమిత్తం వృద్ధురాలిని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు చెప్పారు.

ఆ 300 మందికి మాత్రమే జాప్యం

- స్టాఫ్ నర్సులకు జీతాల చెల్లింపుపై మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో నూతనంగా నియమితులైన స్టాఫ్ నర్సుల్లో 300 మందికి సాంకేతిక సమస్య కారణంగా జీతాల చెల్లింపులో జాప్యం చోటు చేసుకుందని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ట్వీట్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే 6,956 స్టాఫ్ నర్సుల పోస్టులను భర్తీ చేసినట్టు తెలిపారు. వీరంతా వైద్యారోగ్యశాఖతో పాటు మరో ఆరు శాఖల్లో తమ సేవలను అందిస్తున్నట్టు చెప్పారు. ఆస్పత్రులతో పాటు షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనకబడిన తరగతులు, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్లు, వికలాంగుల వసతి గృహాలతో పాటు ప్రజలకు అత్యవసర సేవలందిస్తున్నారని వివరించారు. వీరందరికి సకాలంలో జీతాలు చెల్లిస్తున్నట్టు స్పష్టం చేశారు. 300 మందికి సంబంధించిన పర్మినెంట్, రిటైర్మెంట్ అకౌంట్ నెంబర్ (పిఆర్ఎఎన్) జనరేట్ చేయడంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో వారు బ్యాంకు నుంచి జీతం పొందలేకపోయారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని భరోసానిచ్చారు. అదే సమయంలో రాష్ట్ర ప్రజల ఆరోగ్య సంరక్షణకు భరోసా ఇస్తున్నట్టు మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు.

సివిల్ సప్లైస్ కుంభకోణంలో సిఎం హస్తం

- మాజీ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర పౌరసరఫరాలశాఖలో జరిగిన కుంభకోణంలో సిఎం రేవంత్ రెడ్డి హస్తం ఉందని బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రైస్ టెండర్లు, ప్యాడీ టెండర్లు రద్దయ్యాయా? లేదా? అని ప్రశ్నించారు. సిఎం రేవంత్ రెడ్డి పౌర సరఫరాలశాఖపై ఎందుకు సమీక్షించడం లేదో చెప్పాలన్నారు. త్వరలోనే సివిల్ సప్లైస్ భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఆశాలకు 'పరీక్ష'పై వెనక్కి తగ్గాలి

- ఇప్పటికే ఎన్నో శిక్షణలు పొందారు
- కరోనా నియంత్రణలో వారి పాత్ర కీలకం
- మళ్లీ ఎగ్జామ్ అంటే అవమానించడమే..
- తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి జయలక్ష్మి
- హైదరాబాద్ డిఎంఅండ్‌హెచ్ఒ కార్యాలయం ఎదుట ధర్నా

డిఎంఅండ్‌హెచ్ఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వం అప్పగించే ప్రతి పనినీ ఆశాలు చేస్తున్నారు.. వారికి ఎన్నో ఏళ్ల అనుభవం ఉంది.. అన్ని రకాలుగా ప్రజలకు సేవలు చేస్తున్న ఆశా వర్కర్లకు మళ్లీ ఎగ్జామ్ పెట్టి వారి ప్రతిభను నిరూపించుకోవాలనడం వారిని అవమానించడమేనని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు పి విజయలక్ష్మి అన్నారు. ఆశాలకు అసెంబ్లీ ఎన్నికలకు ముందు.. సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం సికింద్రాబాద్ హరిహరకళా భవన్ వద్ద ఉన్న హైదరాబాద్ డిఎంఅండ్‌హెచ్ఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డిఎంఅండ్‌హెచ్ఒ వెంకట్‌కు వినతిపత్రం అందజేశారు. ఆశాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, పని ఒత్తిడి, వేధింపులను అరికట్టడానికి కృషి చేస్తానని డిఎంఅండ్‌హెచ్ హామీనిచ్చారు. అంతకుముందు ధర్నా వద్ద పి జయలక్ష్మి మాట్లాడుతూ.. ఆశాలకు నష్టం కలిగించే పరీక్షల నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్రంలో గిరిజన ప్రాంతంలో 33 ఏళ్లు, మైదాన ప్రాంతంలో 19 ఏళ్ల నుంచి ఆశాలు పనిచేస్తున్నారని తెలిపారు. ప్రారంభం నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం నిర్వహించిన అనేక ట్రైనింగ్‌లు పొందారని చెప్పారు. రిజిస్టర్లు రాయడం, సర్వేలు చేయడం, ఆన్‌లైన్ పని చేయడం, బిపి, షుగర్, థైరాయిడ్ తదితర అన్నిరకాల జబ్బులను గుర్తిస్తున్నారని, ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందులను ప్రజలకు అందజేస్తున్నారని, తగిన జాగ్రత్తలను ఎప్పటికప్పుడూ ప్రజలకు వివరిస్తున్నారని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు, ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నారని చెప్పారు. కరోనా నియంత్రణలో ఆశాలు కీలకపాత్ర పోషించారని, ప్రపంచ ఆరోగ్య సంస్థ వారిని 'హెల్త్ గ్లోబల్ లీడర్స్' అని అవార్డు కూడా ప్రకటించినట్టు గుర్తు చేశారు. ఇన్ని పనులు నిర్వహిస్తూ, ఇంత సీనియారిటీ ఉన్న ఆశా వర్కర్లకు మళ్లీ కొత్తగా ఎగ్జామ్స్ నిర్వహించి వారి శక్తిని నిరూపించుకోవాలని చెప్పడం సమంజసం కాదన్నారు.

గతంలో బిఆర్ఎస్ ప్రభుత్నమూ ఇదే నిర్ణయాన్ని ముందుకు తెచ్చి అమలు చేయాలని చూస్తే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు చేయడంతో వెనక్కి తగ్గిందని గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అశాలకు మళ్లీ కొత్త సమస్యలు తేవడం అన్యాయం అన్నారు. ఈ పరీక్ష వల్ల ఎలాంటి లాభం లేదని, ఆకాల పనిని, పనుల పట్ల ఆశాల జ్ఞాపకశక్తిని కొత్తగా నిరూపించుకుంటే ఒక సర్టిఫికెట్‌కు రూ.5వేలు ఇస్తామని ప్రభుత్వం సర్క్యులర్ ఇచ్చినట్టు తెలిపారు. ఏండ్లుగా చాకిరీ చేస్తున్న ఆశాలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలనీ, పిఎఫ్, ఇఎస్ఐ తదితర సౌకర్యాలు కల్పించాలనీ కోరారు. ఈ ధర్నాలో సిఐటియు గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం వెంకటేష్, సౌత్ సిటీ కమిటీ అధ్యక్షులు ఎం మీనా, సీనియర్ నాయకులు ఆర్ మల్లేష్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు టి.యాదమ్మ, ఎం అనిత భాగ్యలక్ష్మి పుష్పలత, కవిత, జహీదా తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ రద్దు చేయాలని..

కరీంనగర్ జిల్లాలో అర్బన్ హెల్త్ సెంటర్ ఫీల్డ్ వర్కర్ ఎఎన్ఎంలకు బయోమెట్రిక్ విధానం రద్దు చేయాలని తెలంగాణ అర్బన్ హెల్త్ సెంటర్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాతకు వినతిపత్రం అందజేశారు.

తెలంగాణపై చంద్రబాబు, రేవంత్ కుట్ర

- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్ రెడ్డిలు కలిసి తెలంగాణపై కుట్ర చేస్తే ఊరుకునేది లేదని బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ హెచ్చరించారు. చంద్రబాబు కనుసైగలతో రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఏడు మండలాలను ఆంధ్రలో కలపడంపై బిఆర్ఎస్ ఎంపిలు పార్లమెంటులో పోరాడారని గుర్తుచేశారు. అదే విధంగా కాంగ్రెస్ ఎంపిలు పోరాడాలని డిమాండ్ చేశారు. ఎపిలో పని చేసిన ఆదిత్యనాథ్ దాస్‌ను తెలంగాణ ఇరిగేషన్ సలహాదారుగా నియమించడం సరికాదని ఆయన తప్పుపట్టారు. ఆ నియామకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భద్రాచలం రూరల్ మండలంలో వున్న యటపాక, కన్నాయిగూడెం, పురుషోత్తపట్నం, గుండాల, పిచ్చుకలపాడు పంచాయతీలను తెలంగాణలో కలిపే విధంగా కృషి చేయాలని రేవంత్ రెడ్డిని కోరారు. సింగరేణి బొగ్గు గనులను సింగరేణి సంస్థకు కేటాయించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని డిమాండ్ చేశారు.

డబుల్ బెడ్ రూములను వెంటనే అప్పగించండి..

- ఆర్‌టిఒ కార్యాలయం ఎదుట లబ్ధిదారుల నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మూడో విడతలో కేటాయించిన డబుల్ బెడ్రూం ఇళ్లను వెంటనే తమకు అప్పగించాలని చేయాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారులు బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు లబ్దిదారులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఎనిమిది నెలల కిందట డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించి మంజూరు పత్రాలు ఇచ్చినప్పటికీ అధికారులు అలాట్‌మెంట్ చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాట్‌మెంట్ ఇస్తామని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్దకు రమ్మని చెప్పి..

అధికారులు రాకుండా జాప్యం చేశారని తెలిపారు. ఎంతసేపటికీ అధికారులు రాకపోవడంతో తాము ప్రదర్శనగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకొని నిరసన చేపట్టినట్టు తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో బుధవారం కేటాయిస్తామని హామీ ఇచ్చారని, కానీ అధికారులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇళ్ల కేటాయించకపోతే తమకు కేటాయించిన ఇండ్లలోకి ప్రవేశించి స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. కాగా ఇళ్ల కేటాయింపునకు ఆర్‌డిఒ హామీతో లబ్దిదారులు ఒక కమిటీగా ఏర్పడ్డారు.

ముంచెత్తిన నకిలీ పత్తి విత్తనాలు

- మహారాష్ట్ర, గుజరాత్ నుంచి వస్తున్న నకిలీ విత్తనాలు
- ఇప్పటికే క్వింటాళ్ల కొద్దీ పట్టుకున్న పోలీసులు
- దొడ్డిదారిన పల్లెలకు చేరుతున్న నకిలీ ప్యాకెట్లు
- బైక్‌లు, ఎద్దుల బండ్లపై తరలింపు
- పలుచోట్ల వ్యవసాయాధికారుల నిర్లక్ష్యం.. నష్టపోతున్న రైతులు

ఇటీవల నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న వ్యక్తిను అదుపులోకి తీసుకున్న పోలీసులు (ఫైల్)

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓ వైపు వ్యాపారుల మాయాజాలంతో డిమాండ్ ఉన్న పత్తి విత్తన ప్యాకెట్ల కృత్రిమ కొరత ఉంటే.. మరోవైపు నకిలీ విత్తనాలు సరిహద్దులు దాటి రాష్ట్రంలో రైతుల చెంతకు చేరుతున్నాయి.. ప్రతి ఏడాది లాగే నకిలీ విత్తనాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అధికారులు, పోలీసులు ఎక్కడికక్కడ తనిఖీలు చేపట్టి క్వింటాళ్ల కొద్దీ నకిలీ విత్తనాలను పట్టుకుంటున్నా.. కొత్త దారుల్లో అవి రవాణా అవుతున్నాయి. నిషేధిత బిటి-3 సహా ఊరూ పేరూ లేకుండా నకిలీ ధ్రువీకరణ వివరాలతో ముద్రించిన పత్తి విత్తనాలు సరి'హద్దు'లు దాటి రాష్ట్రంలోని కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ తదితర ప్రాంతాలకు చేరాయి. ప్రధానంగా గుజరాత్, మహారాష్ట్ర నుంచి అక్రమార్కులు ఈ నకిలీ విత్తన ప్యాకెట్లను మంచిర్యాల, అటు ఆదిలాబాద్ బార్డర్లు దాటిస్తున్నారు. అక్కడి నుంచి రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు రవాణా జరుగుతోంది. అనుమానం రాకుండా బైక్‌లపైనా, లేదంటే ఎడ్ల బండ్లపైనా తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం, పక్కా ఇన్‌ఫర్మేషన్ ఉంటే తప్ప పోలీసులు చేసే తనిఖీల్లో పట్టుబడుతున్న పత్తివిత్తన ప్యాకెట్లు క్వింటాళ్లలో ఉంటుంటే.. వారి కండ్లు కప్పి పల్లెలకు చేరిన విత్తనాలు ఏస్థాయిలో ఉన్నాయో బేరీజు వేసుకోవచ్చు. ఇదే క్రమంలో డిమాండ్ ఉన్న పత్తి విత్తన ప్యాకెట్ల కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు తమ మాయాజాలంతో ధరలు అమాంతం పెంచుతూ బ్లాక్‌లో విక్రయిస్తూ రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా పలుచోట్ల వ్యవసాయాధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారు. దీంతో దళారీలు ఆడిందే ఆటగా తయారైంది. నకిలీ విత్తనాల విక్రయాలు రాష్ట్రంలో బహిరంగంగా జరుగుతున్నా పట్టుబడింది కొద్దిగా మాత్రమే. ఇంకా కోట్ల రూపాయల విత్తనాలు లక్షలాది మంది రైతులకు అంటగట్టినట్టు తెలిసింది.

ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో పత్తి సాగు చేసేందుకు రైతులు విత్తనాల కోసం దుకాణాలకు వెళ్తే తాము కోరుకున్న కంపెనీలవి కావాలంటే ఎమ్మార్పీకన్నా అధిక ధర పెట్టాల్సి వస్తోంది. ఎక్కువ మంది ఒకే రకం విత్తనాలు అడుగుతుండటంతో పత్తి విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తూ కర్షకులను ఆగం చేస్తున్న వ్యాపారులు సాధారణ ధరలకు ఎక్కడా అమ్మడం లేదు. రూ.860కి లభించే విత్తనాల ప్యాకెట్‌ను రూ.1600కు అమ్ముతున్నారు. కొన్ని చోట్ల కొన్ని కంపెనీలవి రూ. రెండు వేల వరకు ధర పలుకుతోంది. రైతులు ఎక్కువ కోరే కంపెనీల విత్తనాలు తమ వద్ద లేవని నో స్టాక్ బోర్డు పెడుతున్న వ్యాపారులు.. అవే రకం కావాలని రైతులు బతిమిలాడితే ఎక్కువ ధరకు తెప్పించగలమని నమ్మించి రెట్టింపు కన్నా అధిక ధర వసూలు చేస్తున్నారు.

గతేడాది రూ.14వేలు పలికిన క్వింటా పత్తి..

పదేండ్ల కిందటి సాగు కంటే ప్రస్తుతం పత్తి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిందనే చెప్పొచ్చు. రాష్ట్రంలో ఈసారి 60లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా. ధర ఎక్కువ ఉండటంతో రైతులు పత్తిపైనే మక్కువ చూపారు. ప్రభుత్వం 1.20కోట్ల విత్తనాల ప్యాకెట్లను అందుబాటులో ఉంచింది. అయినా నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లు గుజరాత్, మహారాష్ట్ర నుంచి దళారుల ద్వారా రైతులకు చేరడం గమనార్హం. ఉదాహరణకు.. 2014కంటే ముందు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సుమారు నాలుగు లక్షల ఎకరాల్లో సాగైన పత్తి నేడు కనీసం లక్షా 50వేల ఎకరాలు కూడా దాటడం లేదు. అందుకు కారణాల్లేకపోలేదు. సాగునీటి రంగం అభివృద్ధి చెంది ప్రస్తుతం మెట్ట ప్రాంతాల్లో కూడా నీటి లభ్యత పెరిగింది. దీంతో ఒకప్పుడు మూడు లక్షలు కూడా సాగవని వరి సాగు విస్తీర్ణం నేడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12లక్షల వరకు సాగవుతోంది. దీంతో ఉన్న కొద్దిపాటి విస్తీర్ణంలోనే పత్తి వేస్తున్నారు. అయితే, 2022 నుంచి పత్తి క్వింటా ధర అమాంతం పెరిగింది. గతంలో క్వింటా పత్తి రూ. నాలుగు వేల నుంచి రూ. ఆరు వేలైనా పలికేది కాదు. 2022లో ఏకంగా రూ.18వేలకు క్వింటా పత్తిని వ్యాపారులు కొనుగోలు చేశారు. గతేడాది రూ.14వేల వరకూ పలకడంతో ఈ ఏడాది పత్తి సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు విత్తనాల కృత్రిమ కొరత సృష్టించడం, అడ్డదారుల్లో నిషేధిత బిటి -3 పత్తి విత్తన ప్యాకెట్లు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని తెలిసింది.

వరి విత్తనాలూ సక్రమమేనా?

గతంలో మానకొండూర్ సీడ్స్ కంపెనీలో నిర్వహించిన తనిఖీల్లో వరి విత్తనాల నిల్వలో 796 బ్యాగుల తేడా రాగా.. హుజూరాబాద్ మండలం సింగాపూర్ సీడ్‌ప్లాంట్‌లో 350 క్వింటాళ్లను రికార్డుల్లో నమోదు చేయకపోవడంతో కేసులు నమోదు చేశారు. దమ్మక్కపేట సమీపంలోని సీడ్ ప్లాంట్‌లో విత్తన ధ్రువీకరణ లేకుండా గతంలో జారీ చేసిన లేబుళ (ట్యాగులు) అంటించి విత్తన సంచులను మార్కెటింగ్ చేస్తున్నట్టు తేలింది. జేజీఎల్‌కు సంబంధించి జారీ చేసిన లేబుళ్లను బిపిటి విత్తన సంచులకు వినియోగించడం అధికారుల పర్యవేక్షణ తీరును చాటింది. ఈ పరిస్థితులను చూస్తుంటే వరి విత్తనాలైనా సక్రమమేనా? అనుమానాలు తలెత్తుతున్నాయి.

రొమ్ము శస్త్ర చికిత్సల్లో రోగి భద్రతే కీలకం

- డాక్టర్ వాకటి గీతిక రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్

అన్ని వైద్య చికిత్సలతో పోల్చితే ముఖ్యంగా రొమ్ము శస్త్ర చికిత్సల్లో రోగి భద్రత కీలకమని అపోలో స్పెక్ట్ర హాస్పటల్స్ డాక్టర్ వాకటి గీతిక రెడ్డి పేర్కొన్నారు. ఈ చికిత్సల్లో ఖచ్చితమైన ప్రణాళిక, అత్యాధునిక శస్త్రచికిత్సా పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం అవసరమని ఆమె ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అంటువ్యాధులు, రక్తస్రావం, ప్రతికూల మత్తు ప్రతిస్పందనలు వంటి కొన్ని ఆందోళన ప్రమాదాలను పరిమితం చేయడానికి, శస్త్రవైద్యులు అత్యంత జాగ్రత్త వహించాల్సి ఉంటుందన్నారు. రొమ్ము సంబంధిత శస్త్ర చికిత్సలు రోగుల శారీరక రూపం, భావోద్వేగ శ్రేయస్సుపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయన్నారు. సరైన ఫలితాలను సాధించడానికి రోగి భద్రత, సమాచార సమ్మతి, భాగస్వామ్య నిర్ణయం తీసుకోవడం వంటి అంశాలు రోగుల సంపూర్ణ అనుభవాన్ని, ఫలితాలను గణనీయంగా మెరుగుపరుస్తాయన్నారు.

జూరాలను తాకిన కృష్ణమ్మ

- ఎగువ కృష్ణ నుంచి రిజర్వాయర్‌లోకి ప్రవాహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూరాలకు వరద ప్రవాహం మొదలైంది. ఎగువ కృష్ణ ప్రాంతం కర్నాటక, మహారాష్ట్ర నుంచి క్రమ క్రమంగా వరద ఉధృతి పెరుగుతోంది. ప్రతి రోజూ 7735 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌లోకి చేరుతోంది. వరద ఉధృతి మరింత పెరిగి సగం వరకు నీటి మట్టం చేరితే ఆయకట్టుకు నీరు వదిలే అవకాశాలు ఉన్నాయి. కృష్ణానది ఎగువ ప్రాంతాన కురుస్తున్న వర్షాలకు జూరాలకు వరద నీరు వచ్చి చేరుతోంది. వరదల వల్ల 1.5టిఎంసిల నుంచి నీటిమట్టం 2.495 టిఎంసిలకు నీటి మట్టం చేరుకుంది. రిజర్వాయరు మొత్తం నీటిమట్టం 9.647 టిఎంసిలు. ప్రతి రోజూ లక్ష క్యూసెక్కుల నీరు వచ్చి చేరితే.. వారం రోజుల్లో రిజర్వాయరు నిండుతుందని సాగునీటి అధికారులు చెబుతున్నారు. నీరు తక్కువగా వస్తుండటంతో స్పిల్‌వే, విద్యుత్, కాల్వలకు నీటిని వదలడం లేదు. పుష్కలంగా వరదలు వస్తే.. కెఎల్ఐ, జూరాలతోపాటు ఇతర ప్రాజెక్టుల కింద మొత్తం ఎనిమిది లక్షల ఎకరాలు సాగవుతుంది. గత రబీలోనూ ఆశించిన స్థాయిలో సాగు నీరు అందలేదు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న మంత్రి సీతక్క

పోడు భూముల జోలికి వెళ్లొద్దు..

- కొత్తగా అడవిని నరకనివ్వొద్దు
- అధికారులకు మంత్రి సీతక్క సూచన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రస్తుతం పోడు సాగు చేసుకుంటున్న భూముల జోలికి వెళ్లకూడదని, కొత్తగా అడవులను నరికి సాగు చేయకుండా మాత్రం చూడాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అధికారులకు సూచించారు. ఆసిఫాబాద్ జిల్లాలో బుధవారం మంత్రి పర్యటించారు. ఆసిఫాబాద్ మండలంలోని మోతుగూడ, అప్పపెల్లి గ్రామాల మధ్యలోగల వాగుపై రూ కోటి 82 లక్షలతో నిర్మిస్తున్న హైలెవల్ వంతెన పనులను జడ్‌పి చైర్మన్ కోనేరు కృష్ణారావు, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీశ్‌బాబు, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరివేణుతో కలిసి పరిశీలించారు. ఆసిఫాబాద్ మండలంలోని వాడిగూడ ప్రాథమికోన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల కింద రూ. 6.20 లక్షలతో నిర్మించిన గదులను ప్రారంభించారు. జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలను అందజేశారు. జిల్లా కేంద్రంలో రూ.25 లక్షల నిధులతో నిర్మించనున్న ప్రెస్‌క్లబ్ భవనానికి భూమి పూజ చేశారు. అనంతరం ఇటీవల మరణించిన ఈనాడు పత్రిక వ్యవస్థాపకుడు రామోజీరావుకు మంత్రి సీతక్క ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వ ప్రసాద్, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, జడ్‌పిటిసి నాగేశ్వరరావు, ఎంపిపి మల్లికార్జున్, ఆదిలాబాద్ ఎంపి అభ్యర్థి ఆత్రం సుగుణ తదితరులు పాల్గొన్నారు.

పర్యటనలో భాగంగా మంత్రి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఉట్నూర్ ఐటిడిఎ పిఒ కుష్బు గుప్తా, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్సీ తదితరులతో కలిసి శాఖల పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోడు భూముల సమస్య రోజురోజుకూ పెరుగుతోందని, ఇప్పటికే సాగు చేసుకుంటున్న భూముల జోలికి వెళ్లొద్దని అధికారులను మంత్రి ఆదేశించారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

25 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఖాళీగా ఉన్న 25 వేల ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రభుత్వ హైస్కూల్‌లో బుధవారం బడి బాటలో భాగంగా విద్యార్థులకు బుక్స్, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి ఫలితాల్లో ఐదేళ్ల నుంచి రాష్ట్రంలో సిద్దిపేట జిల్లా సెకండ్ ప్లేస్‌లో ఉందన్నారు. కార్పొరేట్ పాఠశాలను తలదన్నేలా సిద్దిపేటలో ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. సిఎం చెప్పిన విధంగా, ప్రభుత్వ పాఠశాలకు ఉచిత కరెంట్, పారిశుద్ధ్య సిబ్బందిని నియమించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల డ్రాప్ ఔట్ తగ్గించాలన్నారు. సొంత డబ్బులతో విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేసినట్టు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పయ్యావుల పూర్ణిమ ఎల్లం, బిఆర్ఎస్ నాయకులు రాజనర్సు, మండల విద్యాధికారి యాదవ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టుల పనులు వేగవంతం

- విద్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- డిప్యూటీ సిఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సాగునీటి ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో సాగు నీటిపారుదల, విద్యా శాఖల ప్రగతిపై మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ విపి గౌతమ్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల ప్రగతి, వాటికి కావాల్సిన నిధులు, పూర్తయ్యే గడువును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. ప్రపంచంతో పోటీపడే విధంగా ఖమ్మం జిల్లాను అభివృద్ధి చేయాలనే లక్ష్యానికి అనుగుణంగా జిల్లా యంత్రాంగం పనిచేయాలన్నారు. ఉద్యోగులు పారదర్శకంగా, జవాబుదారీగా వ్యవహరించాలని తెలిపారు. వ్యవసాయ ఆధారితమైన ఖమ్మం జిల్లాలో వ్యవసాయాన్ని బలోపేతం చేయడం కోసం సాగు నీరు అందించే ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఉన్న మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులైన ఎన్ఎస్పీ కెనాల్స్, సీతారామ ప్రాజెక్ట్, మధ్య తరహా, చిన్న తరహా పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి క్యాలెండరు తయారు చేసుకుని ముందుకు వెళ్లాలన్నారు. జిల్లాలో కొన్నిచోట్ల చిన్న తరహా సాగునీటి ప్రాజెక్టులకు అన్ని అనుమతులు ఉన్నప్పటికీ ఇప్పటికీ పనులు మొదలు కానీ (ఉదాహరణకు పండ్రేగుపల్లి) ప్రాజెక్టుల పనులను సత్వరం ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్య పైన ప్రత్యేక దృష్టి పెట్టినట్టు చెప్పారు. అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మాణం చేయడానికి ఓటాన్ అకౌంట్ బడ్జెట్లో నిధులు కేటాయించామన్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేరుతో ఏడాదిలోగా నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ఖమ్మం జిల్లాలో రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం కోసం రెవెన్యూ అధికారులు వెంటనే భూములను గుర్తించాలన్నారు. విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ శాఖల ద్వారా అందిస్తున్న ఓవర్సీస్ స్కాలర్‌షిప్స్ సంఖ్యను మరో వందకు పెంచాలని నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి సమస్యలు అధిగమించాలన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు సాగుకు వచ్చే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. పాలేరుకు సంబంధించి రూ.20 కోట్ల ఖర్చుతో 18 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చని తెలిపారు. సీజన్‌లో ప్రస్తుతమున్న సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతులు, చిన్న చిన్న పనులు పూర్తి స్థాయిలో చేసి, వాటి పూర్తి సామర్థ్యంతో చిట్ట చివరి ఆయకట్టుకు నీరందించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం బోధనను అభివృద్ధి పరచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగించి, నమోదులు పెరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, విద్యా శాఖలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా పాఠశాలల అభివృద్ధి పనులు, ప్రభుత్వ పాఠశాలల్లో నమోదులు పెరిగేలా చేపడుతున్న చర్యల గురించి వివరించారు. ఈ సమావేశంలో సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు మట్టా రాగమయి తదితరులు పాల్గొన్నారు.